www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 2 జనవరి 2025
5
తిరుపతి



సిఎం, గవర్నర్‌లకు టిటిడి వేదాశీర్వచనం

ప్రజాశక్తి - తిరుమల




నూతన సంవత్సరం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వేదపండితులు టిటిడి తరపున వేదాశీర్వచనం అందజేశారు. బుధవారం ఉండవల్లిలోని సిఎం నివాసంలో టిటిడి ఈవో జె.శ్యామలరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శేషవస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు, టిటిడి డైరీ, క్యాలెండర్‌లను అందజేశారు.



గడప లోపలే.. 'మతం'..
గడప బయట భారతీయులం..!





తిరుపతి దివ్యారామం వద్ద కరపత్రం ఆవిష్కరించిన పుర ప్రముఖులు

'మతసామరస్య' కరపత్రానికి విశేష స్పందన
తిరుపతిలో పంపిణీ చేసిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మనమంతా భారతీయులం.. హిందూ ముస్లీం క్రైస్తవులు ఎవరైనా భరతమాత ముద్దుబిడ్డలే.. దేశ సమైక్యత, మతసామరస్యం వెల్లివిరియాలి.. స్వేచ్ఛ సమానత్వం, ప్రజాస్వామ్యం.. ప్రగతి బాటలో ముందడుగు వేద్దాం' అంటూ సిపిఎం ముద్రించిన కరపత్రాలకు తిరుపతిలో విశేష స్పందన లభించింది. గడప లోపలే మతం గడప దాటితే భారతీయులం అన్న సహోదర భావంతో ముందడుగు వేద్దామని నినదించారు. ప్రశాంతతకు నిలయంగా ఉన్న తిరుపతి ఔన్నత్యాన్ని కాపాడుకుందాం అని ప్రతినబూనారు. బుధవారం ఉదయం న్యూ ఇయర్ పురస్కరించుకుని సిపిఎం నేతలు బృందాలుగా విడిపోయి తిరుపతి దివ్యారామం, మున్సిపల్ పార్కు, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల, జగ్జీవన్‌రావ్ పార్కు, వినాయకసాగర్ తదితర ప్రాంతాల్లో విస్తారంగా కరపత్రాలను పంచిపెడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలను పురప్రజలకు తెలియజేశారు. దివ్యారామంలో పురప్రముఖులు కరపత్రాన్ని ఆవిష్కరించి మంచి సందేశం ఉందని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గేట్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ నారపరెడ్డి, రమేష్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, పి సాయి లక్ష్మి, మాధవ కష్ణ, ఆర్ లక్ష్మి, బి రవి, నగర కార్యదర్శి కే వేణుగోపాల్, హేమలత, బుజ్జి, నరేంద్ర, మునిరాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యత కొనసాగిస్తూ మన దేశ వారసత్వాన్ని కాపాడాలన్నారు. మత విశ్వాసాలను రాజకీయాన్నివేరువేరుగా ఉంచాలని, మతాన్ని రాజకీయాల్లోకి పబ్లిక్ లోకి తీసుకురాకూడదని, మతం వ్యక్తి యొక్క ప్రైవేటు వ్యవహారంగా మాత్రమే చూడాలని మహాత్మా గాంధీ నిత్యం చెపుతూ వచ్చారని, అదే స్ఫూర్తితో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో లౌకిక భారత రాజ్యాంగం రూపొందిందని కొనియాడారు. వ్యక్తిగత విశ్వాసంగా ఉండే మతం విషయంలో మెజారిటీ మైనారిటీ తేడాలు ముందుకు తెచ్చి ప్రజల సమైక్యతను దెబ్బతీసి విద్వేషాలను కొందరు రాజేస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి ప్రజల ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవడానికి రాష్ట్రానికి ఉన్న హక్కులను సాధించుకోవడానికి మనమంతా సమైక్యంగా పాటుపడతామని ఉద్ఘాటించారు. తెలుగుజాతి మనది నిండుగా వెలుగు జాతి మనది అని మనలో ప్రతి ఒక్కరు గర్వపడేలా నడుద్దాం. గడప లోపల మతం గడప దాటితే భారతీయులం అన్న సహోదర భావంతో ముందడుగు వేద్దామని నినదించారు. ప్రశాంతతకు నిలయంగా ఉన్న తిరుపతి ఔన్నత్యాన్ని కాపాడుకుందాం అని ప్రతినబూనారు.

ఆర్ఎస్ఎస్ చేష్టలకు సిపిఎం ఖండన

ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల వాకర్స్ కేంద్రంలో సిపిఎం మహిళా కార్యకర్తలు ఆర్.లక్ష్మి, సుమతిలు వాకర్స్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ కరపత్రాలను పంచిపెడుతుండగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలమంటూ చేతకర్రలు పట్టుకుని మహిళా నాయకురాళ్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ బూతులు మాట్లాడటాన్ని, కరపత్రాలు పంచడానికి వీల్లేదని వీరంగం చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఖండించారు. ప్రజల్లో చిచ్చుపెట్టే వైఖరిని, మత ఘర్షణలను సష్టించడానికి ఆర్ఎస్ఎస్ చేసే ప్రయత్నాన్ని సిపిఎం ఎదుర్కొంటుందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరిగితే సహించబోమని హెచ్చరించారు.

గూడూరులో... 'ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి, ప్రజల ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవడానికి, రాష్ట్రానికి ఉన్న హక్కులను సాధించుకోవడానికి, మనమంతా సమైక్యంగా పాటుపడదాం, ఆ సమైక్యతకు విఘాతం కలిగించే ఏ విద్వేషపూరిత భావోద్వేగాలనూ మన దరి చేరనివ్వవద్దు. " తెలుగుజాతి మనది - నిండుగ వెలుగు జాతి" మనది' అంటూ కరపత్రాలను ప్రధాన కూడళ్లలో, దుకాణదారులకు అందజేశారు. సి.పి.ఎం. సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సీనియర్ నాయకులు టి.వెంకట రామిరెడ్డి, బి.వి. రమణయ్య,యస్.సురేష్, అడపాల ప్రసాద్, ముత్యాలయ్య, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

ఎంఎస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమలో...
భారీ అగ్ని ప్రమాదం

వార్త మెయిన్‌లో

బాయిలర్ పేలి 25 మందికి పైగా గాయాలు



ఎంఎస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమ 2లో మంటలు చెలరేగుతున్న దృశ్యం

తిరుపతిలో న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి నగరంలో న్యూ ఇయర్ వేడుకల సందడి నెలకొంది. అర్ధరాత్రి కేక్‌ల కటింగ్‌లతో పురప్రజలు సందడిచేయగా, 'డ్రంక్ అండ్ డ్రైవ్' కేసులను పట్టివేస్తూ పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యింది. తెల్లారే లేచి నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించిన జనం, ఆ తరువాత సహచర మిత్రులతో కలిసి పండుగ వాతావరణంలో 'న్యూ ఇయర్' గ్రీటింగ్స్ చెప్పుకోవడం కనిపించింది.

ఎంపిచే రోగులకు పండ్లు పంపిణీ

తిరుపతి నగరంలోని రుయా ఆస్పత్రిలో ఎముకలు, కీళ్ల విభాగంలోని రోగులకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ డివిజనల్ మేనేజర్ రోహిత్ మోహన్ పాల్గొన్నారు.

మేయర్‌కు శుభాకాంక్షలు వెల్లువ

తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషకు బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు, అభిమానులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఛాంబర్ నందు జరిగిన నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు ఇల్లు శుభాకాంక్షలు తెలిపేవారితో కోలాహలం నెలకొంది.



శ్రీకాళహస్తిలో..

గంగమ్మ గుడి ఆలయ పూజారులు ఎమ్మెల్యేని ఆశ్వీరదించారు. **శ్రీకాళహస్తిలో...** ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బందమ్మ కార్యకర్తలు, అభిమానులు, తెలుగు మహిళల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. **గూడూరులో...** ఎంఎల్ఎ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ కేకులు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంఎల్ఎ పిలుపు మేరకు నోట్‌పుస్తకాలు, పెన్నులను అందజేశారు. **పుత్తూరు టౌన్‌లో...** ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్‌ను టిడిపి ముస్లీం మైనార్టీ సోదరులు, మతపెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎ.రఫీ అహ్మద్, ఎ.ముఖద్దస్ ముతవల్లి మహ్మద్ గౌస్, ఎద్దుల హుస్సేన్, ఎస్‌కె షబ్బర్, రసూల్‌బాష పాల్గొన్నారు.

జేసీఐ అంతర్జాతీయ కమిషన్ చైర్మన్‌గా హర్షవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతికి చెందిన ఎన్ బి హర్ష వర్ధన్ రెడ్డి జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా (జెసిఐ) అంతర్జాతీయ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు జాతీయ అధ్యక్షుడు అంకుర్ జున్ జున్ వాలా బుధవారం ప్రకటించారు. ఆయన ఒక సంవత్సరం పాటు పదవిలో ఉంటు అంతర్జాతీయ సంబంధాల నిర్వహణ, సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో ఆయన జాతీయ ఉపాధ్యక్షుడు, ఆసియా పసిఫిక్ డెవలప్ మెంట్ కౌన్సిల్ అధికారిగా పనిచేసారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షునికి హర్ష వర్ధన్ కతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకం పట్ల తిరుపతి జెసిఐ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి విక్రమార్కకు వీడ్కోలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుమల వెంకన్న దర్శనానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు స్థానిక రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం పలువురు జిల్లా నేతలు ఘన వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బట్టీ విక్రమార్క ఏపీ, తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ముందుకు వెళుతుందని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడడానికి తమ వంతు సాయం చేస్తాననీ, ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పార్టీ బలోపేతానికి కషి చేయాలని సూచనలు చేశారు. తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాల గురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, మాంగాటి గోపాల్ రెడ్డి, చిరంజీవి, కలీం, మునిరాజా, ఆంటోనీ, దేవదానం, ప్రేమ్ పాల్గొన్నారు.



కియోస్క్ మిషన్ ప్రారంభించిన టీటీడీ అడిషనల్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల



టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ ను అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ మిషన్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మిషన్ల ద్వారా భక్తులు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు తమకు తోచిన మొత్తాన్ని కియోస్క్ మిషన్ లోని క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా సులభతరంగా విరాళం ఇవ్వవచ్చు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, ఐటీ డీజీఎం బి.వెంకటేశ్వర నాయుడు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి రీజనల్ హెడ్ జి .రామ్ ప్రసాద్, డిప్యూటీ రీజనల్ హెడ్ వి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నూతన అధ్యక్షులుగా వి.చెంగయ్య


ప్రజాశక్తి -తిరుపతి టౌన్



ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు.మున్సిపల్ ఉద్యోగుల నూతన జిల్లా అధ్యక్షులుగా వడ్డిపల్లి చెంగయ్య (వెంకటగిరి), ప్రధాన కార్యదర్శిగా బి. గోపీనాథ్ (గూడూరు), కోశాధికారిగా సిహెచ్ పళణి (సూళ్లూరుపేట) ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 15 మందితో జిల్లా కమిటీ ఏర్పడింది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల నుంచి జిల్లా కమిటీకి నాయకులుగా ఎన్నికయ్యారని తిరుపతి జిల్లాలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ ఆందోళనకు సన్నద్ధమవుతోందని తెలిపారు.



శ్రీగంధం 'చింత'



లోబావి వద్ద భారీ వృక్షం మాయం
దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
ఆదమరిస్తే వన్యప్రాణులకూ ముప్పు
కైలాసగిరిలో పచ్చదానికి భద్రత కరువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన భరద్వాజ తీర్థంలో శ్రీగంధం చెట్టు నరికివేత ఘటన 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందాన మారింది. నిత్యం జన సంచారం ఉండే లోబావి ప్రాంతంలో శ్రీగంధం చెట్టును పూర్తిగా నరికి మాయం చేశారంటే స్మగ్లర్ల మాయాజాలం, గోప్యతనం, నైపుణ్యం కాదు. పూర్తిగా దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండిన బొజ్జల గోపాలకష్ణారెడ్డి కేంద్ర ప్రభుత్వ నిధులతో హరితాభివృద్ధి పథకాన్ని అమలు చేయించారు. కొత్తగా నాటిన చెట్లు అభివృద్ధి చెందక పోయినా సహజ సిద్ధంగా వచ్చిన మొక్కలు మానులయ్యాయి. వీటిలో శ్రీగంధంతో పాటు ఎర్రచందనం వృక్షాలు కూడా ఉన్నాయి. వీటిని కాపాడితే ఆలయానికి కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. అందుకోసమే ప్రభుత్వం హరితాభివృద్ధి పథకం కింద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. నాయకులకు లక్షల రూపాయలు ముట్ట జెప్పి ఉద్యోగాల్లో చేరిన కొందరు ఆలయంలో డ్యూటీలు వేయించుకొని ఫ్యాన్ల కింద సేద తీరుతుండడంతో కైలాస గిరుల్లోని వృక్ష, జంతుజాతికి ముప్పు వాటిల్లుతోంది.


ఆదమరిస్తే మరిన్ని వృక్షాలు మాయం

కైలాసగిరుల్లో విలువైన వృక్ష సంపద ఉంది. అయితే గిరులపై నిఘా కరువవడంతో వృక్షసంపద కరిగిపోతోంది. భోగి పండగ వరకు సమీప గ్రామాల వారు చెట్లను నరికి ట్రాక్టర్లతో తీసుకెళ్తుంటారు. వీరిని నివారించడానికి ఎటువంటి సిబ్బంది లేరు. అంతేగాకుండా కుందేళ్లు, అడవి పందులు, కోళ్లు, కణితులు, నెమళ్ళు, జింకలు లాంటి జంతువులు నివాసం ఉంటున్నాయి. సమీప గ్రామాల్లోని కొందరు వేటగాళ్లు ప్రతిరోజూ జంతువులను వేటాడుతున్నారు. పందులు, కణితులు లాంటి జంతువులు మాయమైపోతున్నాయి. అధికారులు ఆలయంలో జరిగే రాహు కేతు పూజలపై పెట్టిన శ్రద్ధ కైలాసగిరిపై చూపడం లేదు. దీంతో అడవి అనాథగా మారిపోయింది. కనీసం కంచె కూడా నిర్మించలేదు. లోబావిలోని శ్రీ గంధం చెట్టుకే రక్షణ కరువైంది. కొండపై ఉన్న ఎర్రచందనం చెట్లకు ఏ విధమైన రక్షణ ఉంటుందో ఆలోచించాలి. గత పాలకమండలి తీసుకున్న నిర్ణయం కూడా దీనికి కారణం. హరితాభివృద్ధికి కేటాయించిన సిబ్బందికి వయసు మీరడం వల్ల కొత్త సిబ్బందిని నియమించుకోవడానికి తీర్మానం చేశారు. కొత్త సిబ్బందిని నియమించినా ఆలయంలోనే డ్యూటీలు వేసి సంపాదించుకునే మార్గం చూపించారు తప్ప హరితాభివృద్ధికి నియమించలేదు. అగ్ని ప్రమాదాల వల్ల కూడా అడవికి నష్టం కలుగుతోంది. గోశాల, నందనవనం, హరితాభివృద్ధి పథకాల పేరుతో సిబ్బంది ఉన్నా అక్కడ పనిచేయడానికి సుముఖత చూపడం లేదు. అక్కడ అదనపు ఆదాయ మార్గాలు లేవు. హరితాభివృద్ధి, నందనవనం, గోశాల పేరుతో నియమించబడిన సిబ్బంది కూడా ఆలయంలో పలుచోట్ల పని చేసుకుంటున్నారు. అటు నాయకులు, ఇటు అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోతే చెట్లు, పుట్టలు మాయమైపోతాయి. జంతువులు బలై పోతాయి. కైలాసగిరి బోడికొండగా మిగిలి పోవడం తథ్యం.

సామాజిక పింఛన్ కో(వా)త
ఉంటుందో..ఊడుతుందో..!
ఆన్‌లైన్‌లో లబ్ధిదారుని వివరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'సూపర్ సిక్స్' పథకాలంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కేవలం సామాజిక పింఛన్లను మాత్రమే ఇస్తోంది. ప్రస్తుతం ఆ పింఛన్లలోనూ ఎలా కోత పెట్టాలా అనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఎన్టీఆర్ భరోసా కింద జిల్లావ్యాప్తంగా పింఛన్లను తీసుకుంటున్న లబ్ధిదారులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి లబ్ధిదారుని 13 ప్రశ్నలు అడిగి, వాటికి వచ్చిన సమాధానాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ మేరకు గ్రామ సచివాలయం యూనిట్‌గా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సర్వే నిర్వహించనున్నారు. సిబ్బందిని సైతం జంబ్లింగ్ పద్ధతిలో నియమిస్తారు. ఒక మండలంలో పనిచేస్తున్న సిబ్బందిని ఇతర మండలాలకు కేటాయిస్తారు. గ్రామాల్లో 10వేలు, పట్టణ ప్రాంతాల్లో 12వేల కంటే ఆదాయం నెలకు ఉంటే పింఛన్ కట్ అవుతుంది. పది ఎకరాల భూమి ఉన్నా, సొంతంగా నాలుగు చక్రాల వాహనం ఉన్నా, ఇంటిలో ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్ ఉన్నా, నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడుతున్నా, మున్సిపల్ ప్రాంతాల్లో కుటుంబానికి వెయ్యి చదరపు



అడుగుల కంటే ఇంటి స్థలం ఉన్నా 'పింఛన్' కట్ అన్నమాటే.

గత ఏడాది డిసెంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక పింఛన్ల తనిఖీ చేపట్టారు. పెద్దసంఖ్యలో అనర్హులను గుర్తించారు. దాదాపు 11వేల పింఛన్ లబ్ధిదారులను తనిఖీ చేస్తే 563 మంది అర్హత లేకున్నా పింఛన్ అందుకుంటున్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. తిరుపతి జీవకోనలో పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే చేశారు. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఫోటోలతో సహా అప్‌లోడ్ చేశారు. ఈ వివరాల ప్రకారం రాష్ట్రంలో 6 లక్షల మంది అనర్హులు పింఛన్ అందుకుంటున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. పింఛన్ పొందడానికి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, అనర్హులను తొలగించాలని భావిస్తోంది. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం అనర్హుల జాబితాలను ఎంపిడిఓ, మునిసిపల్ కమిషనర్ల లాగిన్ల లో అందుబాటులో ఉంది. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అనర్హులకు నోటీసులు జారీ చేయాలని, నిర్దిష్ట గడువులోగా వారి నుంచి సమాధానాలు తీసులో వాలని నిర్ణయించింది. నోటీసులు అందుకోని వారి పెన్షన్లను చెల్లించకుండా నిలిపివేయాలని భావిస్తోంది. అనర్హులకు పెన్షన్ల చెల్లింపు వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో స్న ష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెన్షన్లను గుర్తించడంపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పైలట్ సర్వేలో నకిలీ పెన్షన్లనుగుర్తించారని, దీంతో ముఖ్యమంత్రి మూడు నెలల్లో అనర్హులను గుర్తించే ప్రక్రియ పూర్తి చేయాలని. కలెక్టర్లను ఆదేశించారు. పెన్షన్ల తనిఖీ పూర్తైన తర్వాత మరోసారి కనీసం 5శాతం పెన్షన్లను ర్యాండమ్ తనిఖీ చేయించనున్నారు. అందులో కూడా అనర్హులు బయటపడితే కలెక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని, మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా అధికారులు ఈ విషయమై కసరత్తును ప్రారంభించారు.




జ్ఞానవి, గమనం పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్

మహిళా విశ్వ విద్యాలయంలో జ్ఞానవి, గమనం పత్రికలను నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆవిష్కరించారు. ఈ రెండు నూతన పత్రికల ప్రచురణకు నాలుగు కోట్ల రూపాయల ప్రాజెక్టు మంజూరయ్యింది. ఈ వేడుకల్లో ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. ఉమకు, రిజిస్ట్రార్ ప్రొ.ఎన్.రజనికి నూతన సంవత్సర శుభాకాంక్షలను వీసీ బంగ్లాలో బోధన, బోధనేతర సిబ్బంది తెలిపారు. ఈ నూతన సంవత్సరం లో మహిళా వర్సిటీ ఇంకా ఇంకా ప్రగతిని సాధించాలని, అందరు సమిష్టిగా కషి చేయాలని ప్రొ. వి.ఉమ ఆకాంక్షించారు. వర్సిటీలో రెండు పత్రికలు జ్ఞానవి, గమనం ను ఆవిష్కరించారు. ప్రధానమంత్రి ఉషా పథకంలో భాగంగా దీనిని మొదలెట్టారు. జ్ఞానవిలో, సామాజిక శాస్త్రాలకు సంబంధించిన పరిశోధన పాత్రలను ముద్రించారు. ప్రొఫెసర్ బి.ఎన్.నీలిమ దీనికి సంపాదకురాలుగా వ్యవహరించారు. అలాగే ప్రొఫెసర్ ఎన్.వెంకటకష్ణ గమనం సైన్స్ జర్నల్స్ కు ఎడిటర్ గా వ్యవహరించారు.

స్విమ్స్‌లో సంక్లిష్ట ఆపరేషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి



స్విమ్స్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో ఇంఫీసేమాటోస్ పాంక్రీటైటిస్ తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్స అందించడం జరిగింది. 32 సంవత్సరాల పేషంట్ కడుపు నొప్పితో అవయవాలు చెడిపోయిన స్థితిలో స్విమ్స్‌కు వచ్చారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. రోగిని పరీక్షించిన వైద్యులు ఇంఫీసేమాటోస్ పాంక్రీటైటిస్ వలన కడుపు నొప్పి వచ్చిందని, దాని వలన ఛాతిలో చీము చేరిందని, ఆ ఇన్ఫెక్షన్ రక్తములో చేరడం వలన సెప్టిక్ షాక్ వచ్చిందని నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి కుళ్ళిపోయిన (ప్యాంక్రియాస్) క్లోమ గ్రంధిని తొలగించి, ఛాతిలో చేరిన చీమును ఐ.సి.డి. ట్యూబ్ ద్వారా తొలగించారు. పేషంట్ ను వారం రోజుల పాటు వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించి, పూర్తిగా కోలుకున్న రోగిని బుధవారం డిశ్చార్జి చేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమౌళీశ్వరన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్ కృష్ణ, మెడిసిన్ విభాగం ఐసియు వైద్యులు డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను జనవరి ఒకటో తేదీ నుండి ట్రెజరీ కార్యాలయంలో స్వీకరిస్తామని జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి ఫిబ్రవరి నెల ఆఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్ డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు అని, అందుకొరకు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబరు, పిపిఓ నంబరు (పింఛన్ పుస్తకం), బ్యాంకు ఖాతా వివరాలు తీసుకొని ట్రెజరీ కార్యాలయంలో గాని, మీసేవ కేంద్రం లో గాని, ఇంటర్నెట్ సెంటర్లో గానీ, పింఛన్ దారుల సంఘంలో గాని లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పెన్షనర్లకు సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అరణియార్‌కు పర్యాటక శోభ వచ్చేనా?

- నత్తనడకన టూరిజం పనులు - అభివృద్ధికి రూ.2.12 కోట్లు మంజూరు
- 60 శాతం పూర్తి, 40 శాతం పనులు అసంపూర్తి - స్థానికుల నిరీక్షణ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఆరణియార్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సుమారు ఏడేళ్ల క్రితం చేపట్టినపనులు ఇప్పటికి 60 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 40 శాతం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 24 ఎకరాల మేర బృందావన గార్డెన్స్, లైట్ హౌస్, బోటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. కొన్ని స్థానిక కారణాల వల్ల 40 శాతం పనులు పూర్తి చేయాల్సి వుంది. త్వరగా వీటిని అధిగమించి జూన్, జులై నాటికి పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. ఆయన పట్టుదల నెరవేరితే పర్యాటక పనులు పూర్తయితే ఆరణియార్ పర్యాటక సందడితో కళకళలాడనుంది. వేయి కళ్లతో ఎదురు చూస్తున్నామని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన టూరిజం పనులు

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం చిన్న తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన ఆరణియార్ జిల్లాకు తలమానికంగా నిలుస్తోంది. నీటి నిలువ 1.82 టిఎంసిల సామర్థ్యం వున్న ఈ ప్రాజెక్టు 1958లో ఏర్పాటై 5వేల ఎకరాల మేర ఆయకట్టు రైతులకు సాగునీటిని అందిస్తూ జీవనాధారం వుంది. అలాంటి ఉపయోగకర ప్రాజెక్టుకు పర్యాటక శోభ సమకూర్చాలనే సదుద్దేశంతో 2017-2018 సంవత్సరం అప్పటి ప్రభుత్వం ఈ టూరిజం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి 2 కోట్లా 12 లక్షల రూపాయలు మేర నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన 40 శాతం పనులు స్థానికంగా కొందరు ప్రాజెక్టు స్థలంలో దుకాణాలు నిర్మించుకుని వుండడంతో వాటిని తొలగించలేని స్థితిలో పనులు నత్తనడకన సాగుతున్నాయి.


60 శాతం పనులు పూర్తి

గతంలో వచ్చినదంతో పార్కులు, ప్రాజెక్టు వాతావరణం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా వుండడంతో తెలుగు, తమిళం, సినిమా సీరియల్ పరిశ్రమలు అనేక చిత్రాలు నిర్మించారు. దీంతో సందర్శకులతో నిత్యం ఈ ప్రాజెక్టు కళకళలాడేది. గత 15 సంవత్సరాల క్రితం అభివృద్ధి పూర్తిగా మరిచి పోవడంతో వచ్చదనం కనుమరుగైంది. ప్రాజెక్టు సైతం ముళ్ల కంపలు పెరిగి కళా విహీనంగా మారింది. ప్రాజెక్టు రహదారిసైతం వర్షానికి బురదమయం కావడంతో ఆ ప్రాంతానికి వెళ్లే వారు క్రమక్రమంగా తగ్గి కళా విహీనంగా మారింది. ఈ కారణంగా తెలుగు, తమిళం, సినిమా సీరియల్ పరిశ్రమలు ఇక్కడ చిత్ర నిర్మాణాలు మానివేశారు. ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆరణియార్ ప్రాజెక్టుపై దృష్టి సారించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిధులు కేటాయించింది. 24 ఎకరాల మేర టూరిజం అభివృద్ధిలో భాగంగా బృందావన గార్డెన్స్, లైట్ హౌస్, బోటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఈ పనులు 60 శాతం పూర్తయ్యాయి. 40 శాతం పనులు ముందుకు సాగడంలేదు.

స్థానికుల నిరీక్షణ

ఈ ప్రాంత టూరిజం అభివృద్ధిలో భాగంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభివృద్ధికి ఒక కోటి 83 లక్ష రూపాయలు తుడా నిధులు మంజూరు చేయించి


60 అడుగులు పూర్తయిన లైట్ హౌస్ నిర్మాణం


ఆరణియార్ ప్రాజెక్టు

84 అడుగుల లైట్ హౌస్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 60 అడుగులు ఎత్తులో నిర్మాణ పనులు శరవేగంగా సాగుతు న్నాయి. ప్రాజెక్ట్ దిగువ భాగంలో వున్న 24 ఎకరాల భూమంలో బృందావనం పార్కింగ్ నిర్మాణం చేపట్టారు. ఆ స్థలంలో కొంతమంది తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకుని వున్నారు. మరి కొందరు చిన్నచిన్న దుకాణాలు నిర్మించుకుని ఉండడంతో బృందావనం పార్కింగ్ అభివృద్ధికి నోచుకో లేదు. గతంలో టెండర్లు ఆలస్యంగా పిలవడం వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఆరు నెలల్లో పనులు పూర్తి చేసుకుంటే జూన్ జూలైలో పర్యటకులకు ఒక గొప్ప వరంగా

పర్యాటక పనులు 60 శాతం పురోగతి..

పిచ్చాటూరు ఆరణియార్ ప్రాజెక్టు పర్యాటక పనులు 60 శాతం పూర్తి అయ్యింది. మిగిలిన పనులు ఏప్రిల్ నెలలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం..

- రామచంద్రమూర్తి, ఇరిగేషన్ డిఈ, పిచ్చాటూరు మండలం.

త్వరలో టూరిజ పనులు పూర్తిచేస్తాం..



పిచ్చాటూరు ఆరణియార్ ప్రాజెక్టు అభివృద్ధికి నేను ఎప్పుడూ ఎప్పుడు ముందుంటాను.. ఈ ప్రాజెక్టు సత్యవేడు నియోజకవర్గ ప్రజలకే కాకుండా తిరుపతి జిల్లా, తమిళ నాడు వాసులకి ఎంతో ఇష్టమైన ప్రదేశం. ఈ ప్రాజెక్టు తిరుపతి -చెన్నై జాతీయ రహదారి ఆనుకుని ఉండటం గొప్ప వరం. చెన్నై నుంచి వేలాది మంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం కోసం నిత్యం పిచ్చాటూరు ప్రాజెక్టు మీదగా వెళ్లడం మరో వరం.. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి అనేకసార్లు కలెక్టర్‌ను కలిసి అభివృద్ధి చేయాలని కోరాం..యాత్రికులకు బృందావన్ గార్డెన్స్ లైట్ హౌస్, బోటింగ్ సదుపాయాలు కల్పించి ఈ ప్రాజెక్టు టూరిజం ప్రాంతంగా మారుస్తాం..

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే.

టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెందు తుందని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టూరిజం పనులు పూర్తయితే బోటింగ్ కూడా అందుబాటు లోకి తీసుకొచ్చి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం తీసుకురావాలనే సంకల్పంతో వున్నారు. ఎమ్మెల్యే పట్టుదల నెరవేరితే ఆరణియార్ ప్రాజెక్టు కు పూర్తి స్థాయి పర్యాటక శోభ సంతరించుకుంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో మత్తు వదిలించిన పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర సంబరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తిరుపతి నగరంలో పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు నాయకత్వంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ స్వయంగా రంగంలోకి దిగి సంబరాల్లో సురక్షిత వాతావరణాన్ని కొనసాగించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడంపై కఠిన చర్యలు తీసుకున్నారు. సుమారు 250 మందికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల ఈ ప్రయత్నం వల్ల ప్రజలు తమ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకుని నూతన సంవత్సరాన్ని సంతోషంగా ప్రారంభించారు.

రైల్వే అధికారులను కలిసిన ఆటో కార్మికులు


రైల్వే అధికారిని కలిసిన ఆటో కార్మికులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే స్టేషన్ జంక్షన్ పరిధిలోని ఆటో స్టాండ్ కార్మికులు నూతన సంవత్సరం సందర్భంగా స్టేషన్ మాస్టర్ పి వెంకటేశ్వరరావు, సిటిఐ బి ప్రసాద్ రావును మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ నాయకులు బివి రమణయ్య, ఎస్కే మున్నా, ఎస్ శేఖరయ్య, ఎస్‌కె రఫీ, ఏ సునీల్ కుమార్, గోపి పాల్గొన్నారు.

తెలంగాణ ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుమల శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుపతి విమా నాశ్రయం చేరు కున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తిరుపతి కాంగ్రెస్ నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. రాబోయేది కేంద్రంలో కాంగ్రెస్ అని, తిరుపతిలో అందరినీ కలుపుకొని కాంగ్రెస్‌ను క్షేత్ర స్థాయిలో పటిష్టంగా ఉండేలా చూడాలని చిట్టిబాబుకు సూచించారు. శ్రీవారి దర్శనానంతరం హైదరా కు ఉప ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.


తెలంగాణ ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న తిరుపతి కాంగ్రెస్ నాయకులు



ఎన్ఎస్‌యూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య సి రంగనాథన్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య సి రంగనాథన్ నియమితు లయ్యారు. మూడు సంవత్సరాల కాల పరిమితికి డైరెక్టర్ గా ఆయనను నియమించినట్లు ఈ మేరకు పరిపాలన భవనం నుంచి వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు. వర్సిటీలోని సాహిత్య విభాగానికి చెందిన ఆచార్య రంగనాథన్ గతంలో మూడు సంవత్సరాలు దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా పనిచేశారు. తిరిగి మరొక మూడు సంవత్సరాలు పొడిగింపు ఉత్తర్వులు పొందారు. దూరవిద్య కేంద్రంలో పరిపాలన విధానం, నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత వంటి అంశాలను పరిశీలించి ఆయనకు తిరిగి మూడు సంవత్సరాలు డైరెక్టర్ గా నియమించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రపురం: నూతన సంవత్సరాది సందర్భంగా మండలం లోని దేవాలయాలు భక్తులతో నిండాయి. బుధవారం ఉదయం 6 గంటల నుండి రాయల చెరువు కట్ట క్రింద గల భవాని జలకంటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కోటి లింగేశ్వర ఆలయం, అభయ ఆంజనేయస్వామి ఆలయం, కామాక్షి అమ్మవారి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ శక్తి పీఠం లోని వారాహి దేవి, శ్రీ మరకత శక్తి కాళీ దేవి అమ్మవార్లకు, గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి, ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనం, తీర్థ ప్రసాదాల తో పాటు నిత్య అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్‌పికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి -రామచంద్రపురం: నూతన సంవత్స రం సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) బుధవారం ఉదయం కార్యాలయాలలో కలిసి దుశ్శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో...నూతన ఉత్తేజం, వరవడితో జిల్లా అభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు అందరం కలిసికట్టుగా పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని, ప్రజలకు మెరుగైన, సంక్షేమ, సుస్థిర, సమర్థవంతమైన, జవాబు దారి తనంతో కూడిన సేవలందించి మంచి ప్రభుత్వానికి సహకారం అందిద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏ ఈశ్వర్ రెడ్డి, అల్మినేని మధునాయుడు, వైకుంఠం శ్రీధర్ నాయుడు, మునిశేఖర్ రాయల్, కత్తి సుధాకర్, బ్రహ్మం నాయుడు పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనారిటీ నాయకులు, గ్రీన్ ఫౌండేషన్ ఛైర్మన్, ఎస్ కే బి అధినేత షేక్ జలీల్ అహ్మద్‌ను నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం పలువురు ఆయనకు పూల మాలలు వేసి శాలువాలుతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుండి టీడీపీ రాజకీయ నాయకులు, కార్యకర్తలు, జలీల్ అహ్మద్ అభిమానులు భారీ సంఖ్యలో విచ్చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జలీల్ అహ్మద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కార్యాలయంలో న్యూ ఇయర్ సందడి


ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్): నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని రఘునాథ రిసార్ట్స్‌లో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి నూతన కార్యాలయంలో న్యూ ఇయర్ సందడి నెలకొంది. బుధవారం ఉదయం రఘునాథ రిసార్ట్స్‌లో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ, చంద్రగిరిఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని), సతీమణి పులివర్తి సుధా రెడ్డిలు నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి, తిరుపతి రూరల్, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టుగలు, ఎర్రవారిపాలెం, తిరుపతి అర్బన్ మండలాల నుంచి అన్ని శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను కలసి దుశ్శాలువులతో, పూలతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలిసికట్టుగా పనిచేసి చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేద్దామని అధికారులు , నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎమ్మెల్యే పులివర్తి నాని అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులతో టిడిపి నియోజకవర్గ కార్యాలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, జనార్థన్ చౌదరి, మాజీ ఎంపీపీలు డి బిందు మాధవి, తానికొండ కేశవ నాయుడు, ఎస్ గౌస్ బాషా, పాకాల జడ్పిటిసి లంగా పద్మజా రెడ్డి, డిపిఓ సుశీల దేవి,, తహసిల్దార్లు కేపీ భాగ్యలక్ష్మి, కే వెంకటరమణ, శివరాం సుబ్బయ్య, రామాంజనేయ నాయక్ , అధికారులు పాల్గొన్నారు

కోడె గిత్తల జోరు..యువకుల హుషారు..

- స్వల్ప సంఘటనలతో పలువురికి గాయాలు - ప్రారంభమైన పరుష పందేలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం కొత్త శానంబట్లలో రంకేసిన కోడిగిత్తలు..యువకుల హుషారుతో జల్లికట్టు పందేలు బుధవారం జోరుగా అంగరంగ వైభవంగా సాగాయి. కొత్త శానంబట్లలో సంక్రాంతికి పది రోజులు ముందే పరుష పందేలు ప్రారంభమయ్యాయి. నూతన సంవత్సర పర్వదినం సందర్భంగా కొత్త శానంబట్లలో జల్లికట్టు పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడె గిత్తలు ఆవులను రైతులు వాటి కొమ్ములకు రంగులు వేసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. వాటి కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల నగదును కట్టి 'నా కోడిగిత్తల పౌరషం చూడండి..' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం..' అంటూ నగదు, విలువైన పలకలు, దుస్తులు కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి బరిలోకి దించారు. అప్పటికే మండలం నుండే కాకుండా చుట్టు పక్కల మండలాలు, జిల్లాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి వాటికి కట్టిన నగదు, పలకలను చేజిక్కించుకునేందుకు పోటీ పడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడె గిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తాయి. యువకులు పౌరుషంతో పశువుల కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించుకునేందుకు పోటీ పడ్డారు. ఈ పోటీలో మూగ జీవాలైన కోడె గిత్తలు బెదిరి ముందుకు పోగా యువకులు వాటిని పట్టుకునేందుకు ముందుకు వచ్చే క్రమంలో స్వల్ప సంఘటనలతో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందేలను తిలకించేందుకు వచ్చిన జనంతో కొత్త శానంబట్ల గ్రామం జనసంద్రమైంది. కోడి గిత్తల కొమ్ములకు పశువుల యజమానులు తమ అభిమాన రాజకీయ నాయకుల ఫొటోలు, పార్టీ జెండాలతో చెక్క పలకను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జట్లుగా ఏర్పడి కోడె గిత్తలకు కట్టిన పలకలను దక్కించుకున్న ఆనందంతో ఎగిరి గంతులు వేశారు. మందుబాబుల ఆగడాలు అధికంగా కన్పించాయి. జనానికి స్థానికులు భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


పందెంలో కోడె గిత్తలను నిలువరిస్తున్న యువకులు

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

- ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి వుంటుందని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ప్రగతి సేవా సంస్థ ఈ నెల12వ తేదీ ప్రగతి సేవాసంస్థ ఐదవ వార్షికోత్సవ సందర్భంగా జనవరి 1వ తేది నుంచి 12 తేది వరకు ప్రగతి వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా గూడూరు సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ సహకారంతో వృద్ధులకు అల్పాహార విందు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గూడూరు ప్రజలకు, ప్రగతి కుటుంబ సభ్యులకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి సేవా సంస్థ మొదటి కార్యక్రమం ప్రతి ఏడాది ఆశ్రమంలో నిర్వహించడం ఆనవాయితీ అని గత ఏడాది కంటే ఈ ఏడాది మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరరీ కాటూరి శ్రీనివాసులు, పయ్యావుల మురళి నాయుడు, కెఆర్ఎం, పి శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు గోల్డ్ షాప్ మల్లికార్జున, పోతిరెడ్డి పెంచలయ్య, లలితా బ్రాండ్ వెంకటేశ్వర్లు, నారాయణ, డిష్ నాగరాజు, తూపిలి యశ్వంత్, , కృష్ణారెడ్డి, కుమార్ నాయుడు, సంచు ముని ప్రసాద్ కోటా శ్రీనివాసులు, నాగేంద్ర నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్

ఆక్రమణల వెల్లువ.. నిద్రావస్థలో అధికారులు..

ప్రజాశక్తి - ఓజిలి : 'ఇక్కడి స్థలం నీది.. అక్కడ స్థలం నాది' అని ఎవరికి వారు వారి వాటాలు వేసుకుంటూ ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతుంటే ప్రభుత్వ అధికారులు మాత్రం నిద్రావస్థలో తూగుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమణదారులకు కట్టబెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ స్థలాలు ఆర్టీసీ , రెవెన్యూ , ఇరిగేషన్ పరిధిలో ఉండడంతో ఆక్రమణ స్థలాలు ఏ పరిధిలో ఉన్నాయో కనీస అవగాహన లేని అధికారులు మండలంలో విధులు నిర్వహించడం శోచనాయంగా మారింది. ఈ ఆక్రమణలను పట్టించుకునే వారు లేకపోవడంతో దర్జాగా ఆక్రమణదారులు ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడమే కాకుండా ఏకంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలు ప్రభుత్వ అధికారులకు కళ్ల ఎదుట కనిపించినా మౌనం వహించడం పట్ల సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని అధిక వసూళ్లు పొందుతున్న వారిపై ప్రభుత్వ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదు ?. ఓజిలి మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు ప్రజా రవాణా నిమిత్తం ప్రభుత్వం ఆర్టీసీకి సదుపాయం కోసం కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వ కేటాయించిన స్థలంలో కబ్జాదారులు ప్రవేశించి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకొని వారి వ్యాపారాలను మూడు పువ్వులుగా ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. చెరువు ఆనకట్టపై స్థలాలు ఆక్రమించుకుని రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చుకుంటూ లబ్ధి పొందుతున్న వారిపై అధికారుల చర్యలు ఏ మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మండల కేంద్రంలో ఇంత తతంగం జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు ఆక్రమణ దారులపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ స్థలాలను వాటాలు వేసుకొని పంచుకోవడమే కాకుండా వ్యాపారాలు కొనసాగిస్తుంటే ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో వారు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన వారికి పంచాయతీ నీటి సదుపాయం కల్పించడం మరో ఎత్తుగా మారింది. ఆక్రమణ దారులకు బహిరంగంగానే నీటి సదుపాయాలు కల్పించి ఆక్రమణ దారులకు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమించిన వారికి విద్యుత్ సదుపాయం, నీటి సదుపాయం, కలిపించ కూడదని నిబంధనలు ఉన్న వాటిని తుంగలో తొక్కి సదుపాయాలు కల్పించడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన దృశ్యం

కళ్యాణ వెంకన్న ఆలయానికి భక్తుల సందడి

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి తిరుపతి సిటీ : తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచే భక్తులు ఆలయం వద్దకు చేరుకుని స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి యున్నారు. ప్రతి ఒక్కరికి వీలైనంత త్వరగా దర్శనం కల్పించేందుకు ఆలయం వద్ద అడ్డదారిలో వెళ్లకుండా కట్టడి చేయడంతో ఎక్కడ ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకున్నారు. స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు అందరికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు

తుమ్మల గుంట గ్రామస్తులు ఆలయం ముందు వెళ్లడం వల్ల భక్తులు, గ్రామస్తులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున వేద పాఠశాల మీదుగా దారి మళ్లించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రామస్తులు సహకరించడంతో ఎవ్వరికీ ఏలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంతంగా ముగిసింది. ఆలయం వద్ద భక్తులు తోపులాట లేకుండా దశల వారీగా లోనికి అనుమతి కల్పించడంతో నిశితంగా స్వామిని చూస్తూ ముందుకు కదిలారు. కొత్త సంవత్సరం అందరికీ మంచి జరగాలని ప్రార్థించారు.

రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నూతన సంవత్సర దినోత్సవాన్ని పురస్కరించుకొని. పద్మశాలి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను పుత్తూరు రూరల్ మండలం వేపగుంట, పరమేశ్వర మంగళం, పంచాయతీ లోని టిడిపి రూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో పుత్తూరులోని ఆయన గృహంలో కలసి శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్, బుజ్జి బాబు, టిడిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.


పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి వరదరజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్లో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సంబరాల్లో ఎంఎల్‌సీయం వీ రామచంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వం విద్యా సంస్థల యాజమాన్యం గత మూడు దశబ్దాలుగా విద్యార్థులకు స్కూల్ సిలబస్ తో పాటు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకి శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితలను సాధిస్తునందుకు విశ్వం విద్యా సంస్థల అధినేత, అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డాక్టరు ఎన్.విశ్వనాథరెడ్డికి అభినందనలు తెలిపారు. పిల్లలు అట పాటలతో సందడి చేసి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ విశ్వ చందన్ రెడ్డి విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్స రంలో నూతన ఉత్సాహంతో నూతన విషయాలను తెలుసుకుంటూ ప్రతి ఒక్కరూ చదువులలో తమ నైపుణ్యం పెంచుకుని చదువులలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నాయకులు రవీంద్రరెడ్డి, భాస్కరరాజు, విశ్వం స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.